# వెనక్కి నడుస్తున్న చరిత్ర



**ఆంధ్ర దేశపు రాజధానీ నగరమైన భాగ్యనగరంలో ఒక మామూలు బస్తీలో కూడలివంటి ప్రదేశం అది. నీళ్ళ కరవు మూలంగా నల్లాల్లో అసలు నీళ్ళే కరవైపోయాయి.**

ప్రొద్దున రేడియోలో ప్రకటన "సాయంకాలం నగరంలోని అన్ని మారుమూల ప్రాంతాలవారికి నీళ్ళ టాంకుల ద్వారా నీళ్ళు సరఫరా చేయబడును." అది విన్న ఆడవాళ్ళంతా సాయంకాలానికి ఇంళ్ళలోని నీళ్ళ డ్రమ్ములు, చిన్నచిన్న డబ్బాలు, బిందెలు సరంజామా అన్నీ వరుసగా పెట్టి అక్కడ నిరీక్షిస్తున్నారు. మగ వాళ్ళు, ఇంట్లోని మిగతా పెద్దవాళ్ళు వాళ్ళ, వాళ్ళ గుమ్మాల్లో వారికి సాయం కోసం నిలబడ్డారు. తల్లు లతోపాటు పిల్లలు చుట్టుపక్కల కేరింతాలుకొడుతూ అల్లరి చేస్తున్నారు.

"ఓ చుక్కమ్మా వంటయిందా?" సత్తెమ్మ పలక రించింది.

"ఆ వంట అయింది. పోరలు తిన్నారు. నేను గిల్ల నీళ్ళ కోసొచ్చి సూత్తున్న. తెల్లారితే సుక్కనీళ్ళు లేవు గొంతులో పోసుకుందామన్నా, జవాబుగా వాపోయింది చుక్కమ్మ.

"ఓ సుక్కమ్మా, సాలమ్మ, గౌరక్క గిల్ల రాండి మీకో ముచ్చట సెప్పుతా" గబగబా అందరు ఆడ వాళ్ళు గుంపులా దగ్గరకి చేరారు.

"ఈ పొద్దెం విన్నారా?" అంది పోచమ్మ.

"పోలమ్మ మొగుడు రెండోదాన్ని కట్టుకున్నా డంట. పోలమ్మ ముగ్గురు బిడ్డల తల్లైంది. గిప్పుడు ఆడికి అసుంటి బుద్ధి పుట్టింది. ఇంక అంతకంటె ఇచిత్తరం జెప్పనా. "పోలమ్మా మామనే ఆమెను ఉంచుకున్నాడంట. గా ముసలోనికి గీవయసుల్ల ఎసుంటి బుద్ధి పుట్టింది. సోకుల్ల బడ్డదు ..." అందరూ ముక్కుమీద వేలేసుకుని నోళ్ళు వెళ్ళబెట్టి వింటున్నారు. ఎవరికి తోచిన తిట్లు, అభిప్రాయాలు వాళ్ళు బయటపెట్టారు.

నా పక్కనే నుంచున్న రాణి నన్ను చూసి పలకరింపుగా నవ్వింది. బదులుగా నేను నవ్వాను.

"వంట అయిందా రాణి" అన్నాను నేను.

"ఎక్కడండీ ఆఫీసు నించి వచ్చి వంట సగం అయిందనిపించాను. పిల్లల్ని ఆయనకి అప్పజెప్పి నీళ్ళ కోసం పరుగెత్తుకొచ్చాను. మిగతాది ఆయన చూస్తా నన్నారు."

ఇంతలో చివరి వాటా రంగాజమ్మగారు హడా విడిగా మా దగ్గరకి వచ్చింది. ముందుకి వంగి మెల్లగా "ఇది విన్నారా? వీధి చివర పంతులమ్మ ముగ్గురి బిడ్డల తల్లి. రాత్రికి రాత్రికి ఎటో వెళ్ళిపోయిందట. తెలిసినచోటల్లా వాకబు చేశారట. కానీ, జాడ తెలియ లేదుట. మొగుడు, పిల్లలు పాపం నానా ఏడుపులు ఏడుస్తున్నారు.

"అయినా మరీ ఈ ఉద్యోగాలు అవీ వచ్చాక ఆడా, మగా మరీ బరితెగించిపోయారు" అంటూ మూతి మూడు వంకర్లు తిప్పింది ఆ ముసలావిడ.

విన్న నాకు, రాణికి ఆ మాటలు ప్రత్యక్షంగాను, పరోక్షంగాను చాలా కష్టంగా తోచాయి. అయినా పెద్దావిడ్ని ఏమీ మందలించలేకపోయాము.

నీళ్ళ టాంకు రావడంతో అందరు హడావిడిగా, గుంపులుగా ఒకర్నొకరు తోసుకుంటూ దాని దగ్గరకి పరుగెత్తారు.




అంతవరకు ధర్మ పన్నాలు చెప్పిన రంగాజమ్మ గారితో సహా మర్యాదా, మన్ననా అన్నీ మర్చిపోయి అవసరం కోసం, బిందెడు నీళ్ళ కోసం ఆ కుమ్ము లాటలో చేరిపోయారు.

ఎలాగో నానా తంటాలు పడి ఓ మూడు బిందెలు నీళ్ళు పట్టగలిగాము. అవి తీసుకుని ఇంట్లోకి వచ్చేటప్పటికి రేడియోలో వార్తలు వస్తున్నాయి. ఒక చిన్న ప్రదేశం కోసం దేశాలు, రాజ్యాలు, ఖండాలు మధ్య యుద్ధాలు జరుగుతున్న వార్తలు, బాంబు దాడులు, విమాన కూల్చివేతలు, హత్యలు.

వంటాడు, పెద్దాడు వున్న ఒక్క కోళ్ళ కంచం కోసం పోట్లాడుకుంటున్నారు.

విన్న వార్తలు, చూస్తున్న సంఘటనలు అన్నీ నాలో ఆలోచనలని రేకెత్తించాయి.

నాగరికతా, విజ్ఞానం పెంచుకున్న మానవుడు ఆదిమానవుడినించి, అంతరిక్షం వరకు ఎదిగాడు. అయినా తనలోని మానవతా దృష్టిని కేవలం అధికార దాహం కోసం, స్వార్థం కోసం మర్చిపోయి తిరిగి ఆదిమానవుడిగా మారిపోతున్నాడు, అన్ని విషయా ల్లోను చరిత్ర వెనక్కి నడుస్తోందా అన్పించింది.

"ఏయ్ శిరీష! ఈ రోజుకి మాకు అన్నాలు పెడ్తావా? లేక అలాగే మైమరచి కలలు కంటుం టావా?" అన్న శ్రీవారి పిలుపుతో ఈ లోకంలోకి వచ్చి తిరిగి మామూలు కార్యక్రమంలో మునిగి పోయాను.

— 'సులేఖ్య'